జ్వరాలతో జర భద్రం

• విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు • ఫీవర్ ఆస్పత్రికి క్యూ కడుతున్న రోగులు • అప్రమత్తతే ఔషధమంటున్న వైద్యులు



ఆయుష్మాన్ భారత్ పథకంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు



ఫ్రై డే డ్రై డేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

నల్లకుంట: హైదరాబాద్ నగరంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా రోజురోజుకూ పెరుగడంతో రోగులు వైద్యుల వద్దకు క్యూ కడుతున్నారు. చిన్న వర్షాలకు అక్కడక్కడ నిలుస్తున్న వర్షపునీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. పలు బస్తీలలో తాగునీరు కలుషిం అవుతోంది.

వాతావరణ మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో గత కొద్ది రోజులుగా నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, వ్యాధుల బారిన పడుతున్నారు. అందుకే ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు సురక్షిత తాగునీరు తాగడం, దోమ తెరలు వాడటం తదితర ముందు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతే శ్రీరామరక్ష..

దొమల వ్యాప్తి కారణంగా మలేరియా, టైఫాయిడ్, డయేరియా, బోధకాలు, డెంగీ, చికూన్ గన్యా తదితర వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో దోమల గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. నీరు నిల్వ చేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, వాడిపడేసిన కొబ్బరి బొండాలు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, ఫ్లవర్ వాజ్‌లు, రుబ్బురోళ్లు, వాటర్ ట్యాంకుల్లో లార్వా అధికంగా వ్యాప్తి చెందుతోంది. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని జీహెచ్‌ఎంసీ ఆరోగ్య శాఖ సూచిస్తోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్‌తో నిమిత్తం లేకుండా డ్రై డేపై అవగాహన కల్పిస్తున్నారు.

అప్రమత్తమైన యంత్రాంగం..

బస్తీలలో జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, ఆశా కార్యకర్తలు బస్తీలలోని ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలు ఉన్నవారి రక్తం నమూనాలు సేకరిస్తున్నారు. అలాగే బస్తీలలోని ప్రజలు జ్వరాలు వచ్చిన వెంటనే బస్తీ దవాఖానాలకు వెళ్లి అవసరమైన పరీక్షలు చేయించుకుంటున్నారు. అక్కడి వైద్యులు జ్వర తీవ్రత అధికంగా ఉన్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షల నిమిత్తం నారాయణగూడలోని ఐపీఎంకు పంపిస్తున్నారు. టైఫాయిడ్ వచ్చిన వారికి మందులు ఇచ్చి పంపిస్తున్నారు. అలాగే జ్వర తీవ్రత అధికంగా ఉన్న వారిని మెరుగైన చికిత్సల కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, ఇతర పెద్ద ఆస్పత్రులకు రీఫర్ చేస్తున్నారు. దీంతో ఫీవర్ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. దీంతో అపరమత్తమైన ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, ఆరోగ్య అధికారులు సమన్వయంతో పరిసరాలు పరిశుభ్రత, పారిశుద్ధ్య పనులపై నియోజకవర్గంలో విస్తృత చర్యలు చేపడుతున్నారు.



వైద్య పరీక్షల కోసం ఫీవర్ ఓపీ క్యూలైన్‌లో వేచి ఉన్న రోగులు

ఫీవర్‌లో గత నెల నుంచి రోగులు

నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో గత నెలలో 17,813 మంది రోగులు ఓపీ విభాగంలో చికిత్సలు పొందారు. 471 మందిని ఇన్‌పేషంట్లుగా చేర్చుకుని చికిత్సలు అందించారు. ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఓపీ, ఐపీ రోగుల వివరాలు ఇలా ఉన్నాయి.

తేదీ	ఔట్ పేషంట్స్	ఇన్‌పేషంట్లు
1	703	08
2	656	15
3	682	11
4	295	05
5	816	28

అప్రమత్తతే ఔషధం



జ్వరము సోకినప్పుడు అశ్రద్ధ చేయకుండా నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని వైద్యం పొందాలి. బయట తయారు చేసిన ఆహార పదార్థాలు తినకూడదు. వర్షాకాలంలో కాచి చల్లార్చి, వడబోసిన నీటిని తాగడం, వేడి ఆహారమే తీసుకోవడం మంచిది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రోగ నిరోధక శక్తి పెంచుకోవడం తదితర జాగ్రత్తలు పాటించాలి. దీంతో పాటు ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే తప్పనిసరిగా పాటించాలి. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని మందులు ఫీవర్ ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్నాయి.

– డాక్టర్ జయలక్ష్మి, సీఎస్ ఆర్‌ఎంవో ఫీవర్ ఆస్పత్రి

'ధ్యానం మానసిక రుగ్మతలను రూపుమాపుతుంది'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ధ్యానం మానసిక రుగ్మతలను రూపుమాపుతుందని యోగాచార్య శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వీఎస్‌టీ వద్ద అమ్మా మెడిటేషన్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానం కార్యక్రమాన్ని 60 మందితో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు ధ్యానం చేయాలన్నారు. అనంతరం యోగాచార్యులు శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాతావాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు, ఆయుష్ సాయి, క్లబ్ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి కోనేరు జైహింద్, డాక్టర్ నీలా శ్రీధర్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి



భరత్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో డివిజన్‌లోని భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై పలువురికి మందలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులను నివారించేందుకు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో దశాల వారీగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సహకారంతో వైద్య శిబిరాలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత, డాక్టర్ దీప్తి, బీఆర్‌ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, గోవిందర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ జీవితమే ఓ ఉద్యమం

తెలంగాణ ఉద్యమంలో ఆయనది చెరగని ముద్ర: వెన్నెల గద్దర్



లోయర్ ట్యాంక్‌బండ్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెన్నెల గద్దర్, రాజు ఉస్తాద్

కవాడిగూడ: గద్దర్ జీవితమే ఓ ఉద్యమం అని... తొలి,మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయనది చెరగని ముద్ర అని గద్దర్ కూతురు వెన్నెల గద్దర్ అన్నారు. మంగళవారం ఆలిండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాగాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించి ఆమె మాట్లాడారు.

◆ గద్దర్ తన ఆట పాటలతో కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేశారని గుర్తు చేశారు. బుల్లెట్‌ను వెన్నులో దాచుకొని అనగారిన ప్రజల పక్షాన నిలిచి పాలకులపై సాంస్కృతిక యుద్ధం చేశారని గుర్తు చేశారు. ప్రజల సమస్యలను తన పాట రూపంలో సమాజానికి తెలిసే విధంగా చైతన్య పరిచిన వ్యక్తి, శక్తి గద్దర్ అని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం తన చివరి శ్వాస వరకు పోరాటం చేశారని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాట స్వరాష్ట్ర సాధన కోసం తోడ్పాటును అందించిందన్నారు. ఆయన కూతురిగా పుట్టడం అదృష్టంగా భావిస్తున్నానని వెన్నెల గద్దర్ పేర్కొన్నారు.

◆ సొసైటీ జాతీయ అధ్యక్షుడు రాజు ఉస్తాద్ మాట్లాడుతూ.... గద్దర్ ప్రతిక్షణం ప్రజల కోసం ఆలోచించే వారని అన్నారు. తన పాట ద్వారా హక్కులు కోల్పోతున్న ప్రజల పక్షాన చివరి శ్వాసవరకు నిలబడ్డారని గుర్తుచేశారు. గద్దర్ ఉద్యమానికి గౌరవంగా తెలంగాణ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టు ఇచ్చి గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల వారియర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగా శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ప్రభావతి, నేతలు సీహెచ్ రాంచందర్, వెంకటేష్, సత్యనారాయణ, రాజు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థలంలో పార్కును నిర్మించాలి

చిక్కడపల్లి: జవహర్‌నగర్ ఎస్సార్టీలోని సివిల్ సప్లయ్ కార్యాలయానికి కేటాయించిన 2000వేల గజాల స్థలంలో పార్కును నిర్మించాలని స్థానిక కాంగ్రెస్ నేత బాబ్జీ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం సత్యనారాయణ, గుండు జగదీష్‌బాబు, సురేష్‌యాదవ్, మారిశెట్టి నర్సింగ్‌రావు, నర్సింగ్‌ముదిరాజ్, గిరబాబు, నవీన్, బాబురావు పాల్గొన్నారు.

అన్నదానం ఆంజనేయులు మృతి

చిక్కడపల్లి: ప్రముఖ వేదపండితులు, విశ్రాంత తెలుగు పండిత్ అన్నదానం ఆంజనేయులు(80) అనారోగ్యంతో చిక్కడపల్లిలోని ఆయన నివాసంలో సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగళవారం బన్సీలాల్‌పేటలో అంత్యక్రియలు నిర్వహించారు.

రూ.4లక్షల విలువైన సెల్‌ఫోన్లు స్వాధీనం

చిక్కడపల్లి: దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికతను ఉపయోగించుకుని ఫోన్లను ట్రేస్ అవుట్ చేశారు. సుమవారు రూ.4లక్షల విలువ చేసే ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బాధితులను ఠాణాకు పిలిచి వివరాలు అడిగి ఫోన్లను అప్పగించినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్, డీఐ వరప్రసాద్ తెలిపారు. ఎవరైన ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే ceir.gov.in వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

మాడభూషి శ్రీధర్‌కు ప్రొ.జయశంకర్ స్మారక పురస్కారం



మాడభూషి శ్రీధర్‌కు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పురస్కారాన్ని అందజేస్తున్న ప్రొ. హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రొఫెసర్ జయశంకర్ జ్ఞాపకాన్ని తెలంగాణలో నిలపడానికి కృషి చేస్తున్నారని అందుకే ఆయన పేరున పురస్కారాన్ని ఇస్తున్నామని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మంగళవారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సమాచార హక్కు కమిషన్ మాజీ సభ్యులు, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్‌కు ఆచార్య జయశంకర్ స్మారక రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ.. నిజాయితీ, నిబద్ధత, విశ్వాసం ఉన్న గొప్ప వ్యక్తి ప్రొ. జయశంకర్ అని అన్నారు. ఆయన వీసీగా ఉన్నప్పుడు చాలా సాహసమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. జయశంకర్ తెలంగాణ జాతిపిత కావాలని అందరు కోరినప్పుడు నేను పీతాను కాదు పతిని కాదు జాతిపితను ఎలా అవుతానని చమత్కారంగా మాట్లాడారని గుర్తు చేశారు.

◆ అదే కోవలో న్యాయ నిపుణులైన మాడభూషి శ్రీధర్ వ్యవహరించారని అన్నారు. ఒక దశలో దేశ ప్రధానమంత్రిని సైతం ఈ సమాజానికి మీరు చేసిన మార్పులు ఏమిటో చెప్పాలని ప్రశ్నించిన సాహసి అని అన్నారు. అందుకే ఆయనకు ఈ అవార్డు రావడాన్ని హర్షిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు కొండి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత జులకంటి జగన్నాథం, రచయితల వేదిక పూర్వ అధ్యక్షులు గాజోజు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు, నగర ప్రధాన కార్యదర్శి దాసోజు కవిత తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో కేబుల్ కటింగ్స్ నిలిపివేయాలి

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటర్‌నెట్, టీవీ ఫైబర్ కేబుల్స్ కట్టింగ్స్‌ను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ కేబుల్ టీవీ, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేగల సతీష్ బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేబుల్ వ్యవస్థను తొక్కేసేందుకు కార్పొరేట్ వ్యవస్థ కుట్రలో భాగంగానే కేబుల్స్ కట్‌చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం విధి విధానాలు రూపొందిస్తే తాము ఎలక్ట్రికల్ పోల్ ట్యాక్స్ కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేబుల్ కట్టింగ్‌ను ఆపకపోతే కేబుల్ వ్యవస్థ మీద ఆధారపడ్డ లక్షలాది మంది కుటుంబాలు రోడ్డున పడతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు ఏర్పాటు చేసినట్లు సింగిల్ కేబుల్ విధానం అమలు చేయాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



అశోక్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: అశోక్‌నగర్ చౌరస్తాలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయని వీటిని పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్ కుమార్ అన్నారు. మంగళవారం అశోక్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ అడిషన్‌ల్ కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, అడిషనల్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన సీఐ భారత్‌లు ఆమెతో కలసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. త్వరలో డివిజన్‌లోని పలు ప్రాంతాల జంక్షన్ల వద్ద సిగ్నల్స్, వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్‌ల ఏర్పాటు చేస్తామన్నారు. చెక్‌పోస్ట్, ఒక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, సత్తిరెడ్డి, సురేష్, ఆకుల సురేందర్, ఆనంద్‌రావు, రవి మాన్యు స్థానికులు పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ.జయశంకర్‌కు ఘన నివాళి

ముషీరాబాద్/చిక్కడపల్లి: తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ భావజాల వ్యాప్తికి తన జీవితాన్ని అర్పించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని నేతలు కొనియాడారు. ముషీరాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాల్లో మంగళవారం ప్రొ. జయశంకర్ సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... స్వరాష్ట్ర సాధనలో దిక్సూచిగా నిలిచిన ఆయన కీర్తి అజరామరమని అన్నారు.



రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి



అచ్చుత్‌రెడ్డి మార్గ్ బ్రహ్మంగారి గుడి వద్ద నివాళి అర్పిస్తున్న టీజేఎస్ నేత నర్సయ్య, తదితరులు



జవహర్‌నగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేత ముఠా జయసింహ



చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి పద్మజ

ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలి



టీఎస్‌ఆర్టీసీ జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎం.థామస్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ వైస్‌చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా థామస్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆర్టీసీని బలోపేతం చేయడంతో పాటు కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్‌సీలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బస్సుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికులకు పనిభారం తగ్గించాలని కోరారు.

టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నూతన కమిటీ...

టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నూతన కమిటీని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్‌గా ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్‌గా ఎండీ మౌలానా, కో–కన్వీనర్‌గా సురేష్, కత్తుల యాదయ్య, కోశాధికారిగా బి.యాదయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్‌టీసీ బస్సుల సంఖ్య పెంచాలని ఆర్టీసీ ఎండీకి వినతి

ముషీరాబాద్: నగరంలో సిటీ బస్సుల సంఖ్య పెంచాలని, బస్టాప్‌లలో బస్సులు ఖచ్చితంగా ఆపాలని మంగళవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ఐద్వా ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐద్వా కార్యదర్శి కె.నాగలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం చాలా సంతోషమన్నారు. కానీ జనాభాకు సరిపోయే విధంగా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. నగరంలో గతంలో 3800 బస్సులు ఉండేవని 2020 నాటికి వెయ్యి బస్సులు రద్దు చేయడంతో ప్రస్తుతం 2800 బస్సులు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. నగర ప్రజల అవసరాలకు అవి ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. దీంతో తీవ్రమైన రద్దీతో మహిళలే కాక పురుషులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. దీనికి తోడు నగరంలో బస్టాప్‌లు, షల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు విమల, షబానా, లక్ష్మి, రోజా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో పుస్తకాల పంపిణీ



ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా మెరుగైన విద్యను అందిస్తున్నారని కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ కమిటీ చైర్మన్ హర్షద్ షేక్ అన్నారు. మంగళవారం నేషనల్ కాంగ్రెస్ మైనార్టీ కమిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ పిలుపు మేరకు హైదరాబాద్ మైనార్టీ కమిటీ కోఆర్డినేటర్ డా. శ్రావణ్ గండి ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమంలో బాలికలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేవిడ్, సలీం, నవీన్, ఇస్మాయిల్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత..

ముషీరాబాద్ రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమంలో మంగళవారం శ్రీనివాస్ కల్యాణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ స్వప్న, సభ్యులు బి.శ్రీధర్‌రావు, సంపత్‌కుమార్, హరిప్రియ, అనంతకృష్ణ, సంధ్యారాణి, కృష్ణప్రియ, పవన్‌కుమార్ తదితరులున్నారు.

సుష్మాస్వరాజ్ సేవలు చిరస్మరణీయం

కాచిగూడ: కేంద్రమంత్రిగా సుష్మాస్వరాజ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. సుష్మస్వరాజ్ జయంతిని మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రేమేందర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఉమాశంకర్, రవి, మెహ్రా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అషుర్‌ఖానాలో ప్రార్థనలు



ముషీరాబాద్‌లోని అషుర్‌ఖానాలో మంగళవారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లింలు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికులతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– ముషీరాబాద్

● శ్రావణమాస పూజలు



వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేసి లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఈ పూజలో ఈవో దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో శ్రావణమాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలో ఈవో లక్ష్మారెడ్డి, అర్చకులు కాశీనాథశర్మ, భవనందశర్మ, భక్తులు పాల్గొన్నారు.

– చిక్కడపల్లి

ఫలహారబండ్ల ఊరేగింపు



భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లోని భూలక్ష్మి అమ్మవారి ఆలయ బోనాలు మంగళవారం వైభవంగా జరిగాయి. పోతరాజుల విన్యాసాల నడుమ ఫలహారంబండ్ల ఊరేగింపు ముందుకుసాగాయి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, నాయకులు నర్సింగ్‌రావు, పరశురాం, నాగేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్